# రన్ ఫర్ యువర్ వైఫ్

**- ఎం. నాగలక్ష్మి**

తూర్పురేఖలు చీకట్లని చీల్చడానికి ప్రయత్నిస్తున్నాయి. ఎర్లీబర్డ్స్ ప్లే గ్రౌండ్‌లో వ్యాయామంతో ఒళ్ళు విరుచుకుని బద్దకం వదుల్చుకుంటున్నారు. అప్పుడే పిచ్చి కుక్క తరుముతున్నట్టు ఓ ఆకారం గ్రౌండ్‌లోకి ప్రవేశించింది. ఆ ఆకారంవైపు తల తిప్పిన వాళ్ళంతా బొమ్మల్లా నిలబడిపోయారు. ఆశ్చర్యంతో అందరి కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి.

సుశాంత్... ఇంతపొద్దున్న షార్ట్స్.. షర్ట్స్‌తో... ఎవరు తరుముతున్నారు సుశాంత్‌ని... అందరి కళ్ళూ గ్రౌండ్ నాలుగువైపులా నిశితంగా గాలించాయి. కనుచూపు దూరంలో ఎక్కడా కుక్క జాడ లేదు... కనీసం పిల్లి కూడా లేదు. విజయ్, రోహిత్, శ్రీధర్ అంతా ఒకచోటికి చేరిపోయారు... ఏమైంది సుశాంత్‌కి... హాస్టల్‌కి వచ్చి మూడేళ్ళవుతోంది. అయినా వాళ్ళెప్పుడూ సుశాంత్ సూర్యోదయం చూడగా చూడలేదు. విజయ్ తన కళ్ళు నులుముకుని పక్కనున్న రోహిత్, శ్రీధర్‌ల కళ్ళు కూడా నులిమాడు.

"నేను చూస్తున్నది నిజమేనా?"

"అది తెల్సుకోడానికి నీకళ్ళు నులుముకుంటే నులుముకో కానీ మా కళ్ళు నులుముతావా?" కయ్యిమన్నారు రోహిత్, శ్రీధర్.

"వాడు మన సుశాంతేనా?" మళ్ళీ అపనమ్మకంగా అడిగాడు విజయ్.

"ఆ... సుశాంతే నిన్నరాత్రి ఊరినించి వచ్చినప్పటి నుంచీ ఏంటో దిగులుగా ఉన్నాడు..."

"మరే... వారం వారం వచ్చే స్వీట్లు... హాట్లు కూడా రాలేదు.

"పాపం ఏమైందో... గ్రౌండ్‌లో గుండ్రంగా 'కీ' ఇచ్చిన బొమ్మలా తిరుగుతున్నాడు."

"పాపం ఏమైందో..."

"నిన్న వాళ్ళ ఊళ్ళో ఏం తోచక టీ.వీ.లో 'బాడీఫిట్‌నెస్, యోగా, ఫిట్ ఆర్ ఫట్' ప్రోగ్రాములు చూసి జోర్ తెచ్చుకున్నాడేమో?" వాళ్ళలా తర్జనభర్జనలు పడుతూ ఉండగానే సుశాంత్ అయిదురౌండ్లు రన్నింగ్ పూర్తిచేసి గ్రౌండ్‌లో ఓ వార కూలబడ్డాడు. అందరూ సుశాంత్ దగ్గరికి పరిగెత్తారు.

"సుశాంత్... గాలి ఏమైనా సోకలేదుకదా నీకు..." విజయ్ ఆదుర్దాగా అడిగాడు.

"అబ్బ... ఒలింపిక్స్‌కి ప్రిపేరవుతున్న లెవెల్లో పరిగెత్తావురా... అంత ఒళ్ళునీ ఇంత సునాయాసంగా ఎలా వంచావురా?" రోహిత్ ఇంకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేకపోతున్నాడు.

"ఎవరిమీద అంతకసి... కొంపదీసి శ్రావ్య నిన్ను పెళ్ళిచేసుకోనను పొమ్మందా?"

"చేసుకుంటాను అంది అందుకే..." సుశాంత నీరసంగా సమాధానమిచ్చాడు.

"మరింకేంరా... అలా పరిగెడుతున్న నిన్ను చూస్తే 'రన్ ఫర్ యువర్ లైఫ్' సినిమా చూస్తున్నంత థ్రిల్లింగ్ వచ్చిందనుకో..." రోహిత్ తన్మయత్వంలో మునిగిపోతూ అన్నాడు.

"ఇది 'రన్ ఫర్ యువర్ వైఫ్'రా."

"ఈ కోడ్ లాంగ్వేజి మానేసి వివరంగా చెప్పుదూ" విజయ్, రోహిత్, శ్రీధర్, సుశాంత్ చుట్టూ సర్దుకు కూర్చున్నారు.

★ ★ ★

ఆదివారం... మెల్లిగా ఎనిమిది గంటలకి కళ్ళు విప్పిన శ్రావ్యకి వంటింట్లోంచి ఘుమఘుమలు, గిన్నెల చప్పుళ్ళు రోజూకంటే ఎక్కువ మోతాదులో విన్పించాయి. బ్రష్ చేసుకుని, షాంపూతో స్నానం చేసి మెల్లిగా వంటింటివైపుకి నడచి లోపలికి తొంగి చూసింది. పులిహోర, వడలు, పాయసం, బొబ్బట్లు కొన్ని తయారైౖ, మరికొన్న తయారవడానికి తయారుగా ఉన్నాయి.

"అమ్మా ఇవాళ ఏం పండగ... ఎవరైనా భోజనానికి వస్తున్నారా?" వంటమనిషి అప్పమ్మతోపాటు హైరానాపడ్తున్న తల్లిని అడిగింది.

"ఇవాళ నీకు నిశ్చితార్థం... పదిమంది భోజనానికి వస్తున్నారు.

"నా నిశ్చితార్థం నాకు తెలియకుండానా?"

"ఇందులో తెలియడానికి ఏముందే... చిన్నప్పటి నుంచీ అనుకున్నదేగా. నీకూ ఇష్టమేగా... ఇవాళ మంచిరోజు... రాత్రి మీ బావ కూడా వచ్చాడు. అందుకని హఠాత్తుగా ఇవాళే చేద్దాం అనుకున్నారు మీ నాన్న, మామయ్యా... పైన నీ గదిలో పట్టుచీర నగలు తీసిపెట్టాను వెళ్ళి తయారవు..."

"అమ్మా నిశ్చితార్థానికి ముందు నేను బావతో మాట్లాడాలి... తర్వాతే మిగిలిన తంతు."

కమలమ్మ వింతగా చూసిందోక్షణం.

శ్రావ్యకి బావంటే ప్రాణం... చిన్నప్పటినుంచీ పెద్ద వాళ్ళ అభిప్రాయం ఇద్దరికీ తెలుసు. సుశాంత్ ఇంజనీరింగ్ అవగానే పెళ్ళి అని అనుకుంటున్నది తెలుసు. వచ్చినప్పుడల్లా గంటల తరబడి బావతో మాట్లాడుతూనే ఉంటావు కదే... ఇవాళ కొత్తగా ఏం మాట్లాడతావు" కమలమ్మ నవ్వింది.

"కాదమ్మా... నేను మాట్లాడాలి."

"అత్తయ్యా ఏం చేస్తున్నావు భోజనానికి..." సుశాంత్ తిన్నగా వంటింట్లోకి వచ్చాడు పార్వతి వెనక్కాలే.

"వదినా... వాసనలు వీధి చివరి వరకూ గుబాళిస్తున్నాయి." పార్వతి బొబ్బట్టు ముక్కతుంచి నోట్లో పెట్టుకుంటూ అంది.

"అత్తయ్యా పులిహోర, బొబ్బట్లు టేస్ట్ చూడనా..." సుశాంత్ అంటూనే ఓ ప్లేటునిండా పులిహోర, రెండు బొబ్బట్లు పెట్టుకుని తినడం మొదలుపెట్టాడు.

"ఏమే శ్రావ్యా... ఇంకా తయారవలేదా... గబగబా రెడీకా. మళ్ళీ పంతులుగారొచ్చేస్తారు. పార్వతి శ్రావ్యవైపు చూస్తూ అంది. పార్వతి, శ్రావ్యకి మేనత్త... వెనక వీధిలోనే ఉంటారు... రోజూ వచ్చి వెళ్తూనే ఉంటుంది అన్నగారింటికి.

"సుశాంత్ శ్రావ్య నీతో ఏదో ప్రత్యేకంగా మాట్లాడాలిట... తర్వాతే నిశ్చితార్థంట" కమలమ్మ నవ్వుతూ చెప్పింది.

"ఏంటే.. దిష్టికొట్టేలా వాడిని అలా చూస్తున్నావు... ఒరేయ్ శ్రావ్య మొన్న మాకు భోజనంలో నూనె, ఉప్పు, తీపి తగ్గించాలని పెద్ద లెక్చర్ ఇచ్చిందిరా." పార్వతి నవ్వుతూ అంది.

"అదే క్లాసు నాక్కూడా వేయబోతున్నావా" సుశాంత్ శ్రావ్యవైపు ఓరగా చూస్తూ అన్నాడు.

శ్రావ్య మేనత్తవంక సుశాంత్ వంక మార్చి మార్చి చూసింది. అత్తయ్యా, మామయ్య ఇద్దరూ ఒబేసిటీ కేటగిరీలోకి వస్తారు. నలభైఐదు ఏళ్ళు కూడా లేకుండానే ఇద్దరికీ బి.పీ., షుగర్. సుశాంత్ పన్నెండేళ్ళ వరకూ సన్నగా, రివటలా ఉండేవాడు. ఇప్పుడు పిల్ల ఏనుగులా ఉన్నాడు... తిండి యావ ఎక్కువ. అందులోనూ రెండిళ్ళలోనూ స్వీట్లు, హాట్లు ఏదో ఒకటి చేసిపెడ్తూనే ఉంటారు. బావంటే తనకి ప్రాణం.. కానీ శ్రావ్యకి సునంద తండ్రి మరణం గుర్తు

వచ్చింది. షుగర్ కంట్రోల్ చేయక నడివయస్సులోనే కాలు యాంప్యులేట్ అయి కొన్నాళ్ళని ఇంకా కాంప్లికేషన్స్ వచ్చి పోయాడు. అప్పుడే ఫ్రెండ్స్ అందరూ సునందని ఓదార్చడానికి వెళ్ళారు వాళ్ళ ఇంటికి... సునందే పెద్దపిల్ల... వెనక ఇంకో ఇద్దరు అమ్మాయిలు.. సునంద తల్లికి బి.పీ. పెరిగిపోయి హాస్పిటల్లో ఉంది. అప్పుడే రెండో సంవత్సరం మెడిసిన్ చదువుతున్న శ్రావ్య ఫ్రెండ్ సమీర అందరికీ బి.పీ., షుగర్లు వాటిని కంట్రోల్ లేకపోతే వచ్చే పరిణామాలు, సమస్యల గురించి అందరికీ చెప్పింది. అప్పట్నుంచే శ్రావ్య అత్తయ్య, మామయ్యలు భోజన విషయంలో ఏ జాగ్రత్తా తీసుకోకపోవడం, కంట్రోల్ లేకుండా తినడం గమనిస్తోంది. స్థూల కాయం, హెరిడిటీ రెండూ కలిపి సుశాంతని కూడా అనారోగ్యం పాలు చేస్తాయన్నది శ్రావ్యకి అర్థమైపోయింది.

"బావా... నేను తయారవుతూ ఉంటాను. నీ తినడం అయితే ఓసారి పైకిరా." బావంటే తనకి ప్రాణం.. అతన్ని తప్ప ఇంకెవరినీ భర్తగా ఊహించలేదు. బావనే పెళ్ళి చేసుకుంటుంది కానీ... ఈలోపే బావని కాస్త మార్చుకోవాలి అనుకుంది శ్రావ్య. శ్రావ్య నిర్ణయానికి తలవంచక తప్పలేదు సుశాంత్‌కి.

* * *



"నిన్న నాకు శ్రావ్యతో నిశ్చితార్థం అయింది" సుశాంత్ మెల్లగా అన్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్" శుభవార్త అంత మెల్లిగా చెప్తావేంటి?"

"స్వీటేదీ మరి... ఎప్పుడూ పళ్ళు, స్వీట్లు ఎన్నో తెచ్చేవాడివి... ఈసారి చేతులు ఝాడించుకుంటూ వచ్చావు" రోహిత్, విజయ్ గోల చేశారు.

సుశాంత్ ఎపుడు వూరినించి వచ్చినా రెండు రకాల స్వీట్లు, రెండు రకాల కార, పనస తొనలు, అరటిగెల లాంటి సరంజామాతో వస్తాడు. పదిహేను రోజులకోసారి ఇంటికి వెళ్తూనే ఉంటాడు కాబట్టి సుశాంత్ తెచ్చే చిరుతిళ్ళకోసం ఆశగా ఎదురుచూడడం అలవాటయింది సుశాంత్ ఫ్రెండ్స్‌కి.

"జీవితం స్వీట్, స్వీట్‌గా ఉండాలంటే స్వీటు గురించి మర్చిపో అంది శ్రావ్య" సుశాంత్ నీరసంగా అన్నాడు.

"పోనీ హాటు తీసుకురాకపోయావా?" శ్రీధర్ వదలలేదు.

"స్వీటూ లేదు హాటూ లేదు... పది నెలల్లో పది కేజీలు తగ్గించకపోతే నో పెళ్ళి అంది" సుశాంత్ చిరాగ్గా అన్నాడు.

"అమ్మో గట్టిదే మీ శ్రావ్య... ఇప్పట్నుంచే కంట్రోల్‌లో పెడ్తోందన్న మాట... మేం చెప్తే విన్నావా కాస్త ఒంటి బరువు అదుపులో పెట్టునాయనా అంటే... అవుస్లే శంఖంలో పోస్తేకానీ తీర్థం కాదు" శ్రీధర్ టీజ్ చేశాడు.

సుశాంత్ బ్రిలియంట్ స్టూడెంట్... అన్ని యాక్టివిటీస్‌లో చురుగ్గా ఉంటాడు... సుశాంత్ అంటే కాలేజీలో అందరికీ ప్రత్యేకమైన ఇష్టం ఉంది. సుశాంత్‌లో ఉన్న లోపం ఒక్కటే... తిండిపిచ్చి... హాస్టల్ భోజనం నచ్చక బయటి నుంచి క్యారియర్ తెప్పించుకుంటాడు... రెండు పూటలా ఫాస్ట్‌ఫుడ్ తింటూ ఉంటాడు బయటికి వెళ్ళి... అంతే కాకుండా మధ్య మధ్య మిల్క్‌షేక్‌లు, క్యాడ్‌బరీస్, ఐస్‌క్రీం.

సుశాంత్ రోజూ అందరికంటే ముందే గ్రౌండ్‌లో కన్పిస్తున్నాడు.

బయటి తిండి మానేసి హాస్టల్ భోజనమే తింటున్నాడు... మధ్యలో పళ్ళు, పాలు తప్ప చిరుతిళ్ళు పూర్తిగా మానేశాడు. నెల నెలా ఊరికెళ్ళి శ్రావ్యకి వెయిట్ రిడక్షన్ చూపిస్తున్నాడు.

"అబ్బ నీ డైటింగ్‌తో మా ప్రాణం తీస్తున్నావురా... నెలలో రెండుసార్లు వచ్చే స్వీట్లు, హాట్లు ఆగిపోయాయి. మా నాలుకలు పూర్తిగా చచ్చిపోయాయి." రోహిత్, విజయ్ సుశాంత్‌తోపాటు గ్రౌండ్‌లోకి నడిస్తూ కంప్లైంట్ చేశారు. చలికి వణుకుతూ ముడుచుకుని నడుస్తున్నారు ముగ్గురూ.

"హాయ్ సుశాంత్... అప్పుడే నీ ఎక్స్‌ర్‌సైజు అయిపోయిందా... రన్ ఫర్ యువర్ లైఫ్.. యార్ రన్ ఫర్ యువర్ వైఫ్" శ్రీధర్ అరుస్తూ గ్రౌండ్‌లోకి వస్తూంటే అందరూ పకపకా నవ్వసాగారు.

★

